# రిక్షా రసం టైపు కంప్యూటర్స్

కుక్క గొడుగుల్లా మొలుచుకొస్తున్న కాలేజీల్లో అదొక కాలేజీ. టీనేజ్ పిల్లల డిగ్రీ క్లాసులో తెలుగు లెక్చరర్‌గారి కష్టాల క్లాసు. ఎర్రని, గుండ్రని బట్టతలకు చుట్టూ నల్లని, తెల్లని వెంట్రుకల బోర్డరు.

తుపాను ముందు ప్రశాంతత ఒక్క క్షణం రాజ్యమేలింది. భయపడ్తూనే బోర్డు వైపు తిరిగాడు లెక్చరర్. మరుక్షణమే నవ్వులు, విజిల్సుతో మారుమోగిపోయింది క్లాసు. బోర్డుపై ఏదో రాయబోతున్న ఆయన బట్టతలపై ఒక విమానం వచ్చి వాలింది.

అది రోజూ తనకలవాటే కాబట్టి నెమ్మదిగా తను రాయాల్సింది రాసి స్టూడెంట్స్ వైపు తిరిగాడు. తలపై విమానం ఆయన కదలికకు వచ్చి ముందున్న టేబిల్‌పై వాలింది.

అందరూ బుగ్గల్లో పట్టి వుంచిన నిశ్శబ్దం.

విమానం రెక్కలపై వున్న కామెంట్స్ చూసి అప్పటివరకూ కడుపులో దాచుకొన్న ఆయన కోపం ఎర్రగా మారి ముఖంపైకి వచ్చింది. "ఒకవైపు 'రబ్బరు గుండు' మరొకవైపు హెలీ పాడ్'.

అందరికీ తెల్సు ఆయనకి కోపం వచ్చినప్పుడు ఏమవుతుందో!

పాపం! లెక్చరర్ 'వాకవుట్' చేశాడు కోపంతో వూగిపోతూ!

మళ్ళీ చప్పట్లు, విజిల్సు.

అందరూ గ్రూపులు, గ్రూపులుగా బయటికొచ్చారు.

అందులో ఒక గ్రూపు రత్న, తేజ, ఇందు.

"తొందరగా వెళ్తే మ్యాట్నీకి వెళ్ళొచ్చే" అంది రత్న వాచీ చూస్తూ.

"చిరంజీవి 'రౌడీ గ్యాంగ్ మొగుడు' 'గీత్'లో ఆడుతోంది వెళదామా?" అడిగింది ఇందూ గొంతులేస్తూ.

కాసేపు 'చిరు' పేరు తల్చుకొని ముగ్గురూ పులకించి, మెలికలు తిరిగిపోయారు.

"ఓ రిక్షా అబ్బాయ్" పెద్దగా పిల్చింది ఇందు.

"కనబట్టంలా నాది సైకిలు. రిక్షాకాదు" సైకిలు దిగి చెప్పి వెళ్ళిపోయాడతడు.

"ఛీ! చిరుకీ, వీళ్ళకీ అదే తేడా" విసుక్కొంది ఇందు.

ఈసారి నిజంగా రిక్షా వచ్చింది అక్కడికి.

"వస్తావా?" అడిగింది రత్న.

రిక్షా అబ్బాయి మెలికలు తిరిగిపోయి రిక్షా దిగుతూ బొక్కబోర్లా పడ్డాడు. వెంటనే దులుపుకుంటూ లేచి 'సారీ' అన్నాడు.

ముగ్గురూ గుసగుసగా 'చిరులా సారీ చెప్పాడు కదా' అనుకున్నారు.

"అసలైనా మా ముగ్గుర్నీ లాగగలవా?" అడి



గింది రత్న.

"చిరంజీవి 'రౌడీ గ్యాంగ్ మొగుడి' కైతే లాగగలను."

"చూశావా చిరు అంటే రిక్షా వాడికి కూడా క్రేజే" అనుకుంటూ రిక్షా ఎక్కి కూర్చున్నారు, బేరం ఆడటం మర్చిపోయి.

రత్న రిక్షా సీటు మీద కూర్చొని చిరు గురించి ఆలోచిస్తుండగానే 'గీత్' వచ్చేసింది.

"ఎంత?" అడిగింది ఇందు.

డాక్టర్. యశస్వి

"ఆరు రూపాయలు! సిక్స్ రూపీస్!" చెప్పాడు.

"తెలుగులో ఆరు, ఇంగ్లీషులో ఆరు మొత్తం పన్నెండా!" అడిగింది తేజ

"నీ జోకులాపవే సినిమా టైమవుతోంది" అంటూ రిక్షా అబ్బాయికి డబ్బులివ్వబోయింది రత్న.

"నాకు డబ్బు లొద్దు సినిమా టిక్కెట్టు కావాలి."

ముగ్గురూ స్టన్ అయిపోయి అప్పుడు చూశారు ఆ అబ్బాయిని పరీక్షగా. చూడటానికి నిజంగానే పాత సినిమాల్లో రిక్షా తొక్కే హీరోలా వున్నాడు.

"పిచ్చి పిచ్చి వేషాలెయ్యక డబ్బులు తీసుకొని వెళ్ళు" అతని చేతుల్లో డబ్బులుంచి బుకింగ్ వైపు నడిచింది రత్న మిగతా ఇద్దర్నీ రమ్మంటూ.

రిక్షా రవికి మండిపోయింది. వెంటనే ఒక 'జెలుసిల్' మాత్ర చప్పరించి, ఎలాగైనా వాళ్ళ ప్రక్కన కూర్చుని సినిమా చూడాలని నిర్ణయించుకొని ఒక 'మాస్టర్ ప్లాన్' వేశాడు.

వాళ్ళు ముగ్గురూ హడావిడిగా టికెట్స్ తీసుకొని హాల్లోకి వెళ్ళగానే వాళ్ళ వెనక నుంచొని టిక్కెట్ తీసుకోబోయే అమ్మాయితో చెప్పాడు లైను దగ్గరకెళ్ళి.

"ఏవండీ! ప్లీజ్ మా ఆవిడ నిండు గర్భిణీ చూడండి" అంటూ అక్కడ నుంచొని వున్న ఒకావిడని చూపిస్తూ "ఒక్క టిక్కెట్ ప్లీజ్"

"ఆవిడని హాస్పటల్‌కి తీసుకెళ్ళాలి సినిమా హాల్లోకి కాదు" అని చెప్పేసి ఆమె కౌంటరులో చేయిపెట్టబోయింది.

అప్పుడు జరిగింది 'అ' అనుకోని సంఘటన.

బలంగా ఆవిడని 'క్యూ' లోంచి బయటకు లాగేసి వెనకమ్మాయి "మూడు సిక్స్ రూపీస్" చెప్పింది కౌంటరులో చెయ్యిపెట్టి.

టిక్కెట్లు, చిల్లర తీసుకొని తాపీగా చెప్పింది "చిరు సినిమా చూస్తానన్న ఒక నిండు చూలాలి కోర్కె తీర్చలేకపోతే నేను 'చిరు' అభిమాన సంఘాల మహిళా సెక్రటరీనే కాదు. పో! వెళ్ళి వెనక నుంచొని టిక్కెట్టు తీసుకో".

ఆ అమ్మాయి తిట్టుకుంటూ వెనక్కెళ్ళిపోయింది.

"థాంక్సండీ! మీ ఋణం నా రిక్షాలో మీ యింటిదగ్గర డ్రాప్ చేసి తీర్చుకుంటాము"

అన్నాడు ఆరు రూపాయలిస్తూ.

"రిక్షాలో డ్రాప్ చేస్తారా?" టిక్కెట్ ఇవ్వబోతూ అడిగింది.

అప్పుడు డవుట్ వచ్చింది రిక్షా రవికి టిక్కెట్ ఇవ్వదేమోనని.

"అబ్బే కాదు! నా స్కూటరులో"

టిక్కెట్ ఇచ్చి అనుమానంగా అడిగింది "మరి ఒక్క టిక్కెట్ తీసుకొన్నారు – మీరు చూడరా?"

'ఆ అమ్మాయికి ఈపాటికి వాళ్ళాయన టిక్కెట్ సంపాదించే వుంటాడు' అని మనసులో అనుకుని తెలివిగా అక్కడ్నుంచి తప్పుకొని, నంబరు వెతుక్కుని సిక్స్ రూపీస్‌లో కూర్చున్నాడు రిక్షా రవి.

అప్పటికే సినిమా మొదలయింది. అంతా చీకటి మయం.

మిగతా సినిమా టైమ్ తెలీకుండా అయిపోయింది. అందరూ బయటికొచ్చారు.

రిక్షా తాళం తీసి మళ్ళీ హాలు ముందుంచాడు రవి.

వాళ్ళు ముగ్గురూ రవిని గుర్తుపట్టి "మళ్ళీ వస్తావా" అని అడిగారు.

కొంచెం ఇబ్బందిగా అటు ఇటూ చూసి "ఎక్కడికి" అని అడిగాడు.

"లేడీస్ హాస్టలు"

"ఎక్కడుంది"

కిసుక్కున నవ్వారు ముగ్గురూ 'లేడీస్ హాస్టలు తెలీని మగాడా?' అనుకుంటూ.

"చీకటి పడుతున్నట్లుంది తొందర తొందరగా తొక్కుతావా"

"పది నిమిషాల్లో వెళ్ళిపోతాం"

"ఎంత" అడిగింది ఇందు.

"ఇందాక డబ్బు లొద్దు సినిమా టిక్కెట్ కావాలన్నాడు. ఇప్పుడు ఏకంగా హాస్టల్లో రూము అడుగుతాడేమో! ఖర్మ?" అంది రత్న.

"ఈసారి డబ్బులిస్తే చాలు" అన్నాడు రవి.

ముగ్గురూ రిక్షా ఎక్కి కూర్చున్నారు.

వాళ్ళ మాటల్ని బట్టి తను బాగుంది అనుకున్న అమ్మాయి 'రత్న' అని గ్రహించాడు రవి. ఆ అమ్మాయి గురించి ఆలోచిస్తూ ఎదురుగా ఒక ఆవుని గుద్ది 'సడెన్'గా రిక్షా ఆపేశాడు.

"ఏంటబ్బాయ్! అసలు రిక్షా తొక్కడం కొత్తా నీకు" ఇందూకి కోపం వచ్చింది.

"అబ్బే ప్రొద్దుట నుండీ తొక్కుతున్నా అలవాటైందిగా."

"మరేంటిదీ మా కాలో చెయ్యో విరిగితే?"

"అబ్బే అలా ఎందుకవుతుంది? ఆవుని గుద్దితే నన్ను మీరు 'కౌబాయ్' అనుకుంటారని అలా చేశాను" అన్నాడు రవి.

అతని సమయస్ఫూర్తికి ముగ్గురి కోపాలెగిరిపోయాయి.

హాస్టలు వచ్చేసింది.

రత్న పది రూపాయలు అతని చేతిలో పెడుతూ అలవాటైన ఊతపదం 'థాంక్స్' అంది.

"మెన్షన్ నాట్" అన్నాడు రవి. రత్న ఆశ్చర్యపోయింది.

"నువ్వేమైనా చదువుకున్నావా?" అడిగింది రత్న.

"అబ్బే లేదు! దుంపల బడిలో ఐదు చదివాను."

ముగ్గురూ హాస్టలు లోపలికి వెళ్ళిపోయారు.

* * *

కాలేజీ హాలీడేస్ ఇచ్చేశారు. ఇందు, రత్న, తేజ శెలవుల్లో టైపు, కంప్యూటర్ కోర్సులలో చేరదామనుకున్నారు.



మరుసటిరోజే ముగ్గురూ 'డి.కె. కంప్యూటర్ పాయింట్' కెళ్ళి 'సమ్మర్ కోర్సు'లో చేరారు.

లోపలంతా ఏ.సి. రూము. ముగ్గురూ మూడు కంప్యూటర్లతో కాసేపు ఆడుకున్నారు.

కాసేపటికి ప్రక్కకు చూసిన రత్న స్టన్ అయిపోయింది.

వెంటనే లేచివెళ్ళి 'తేజ'కు చూపించింది.

తేజ కూడా చూసి "అవును రిక్షావాడే" అంది.

ఇంతలో 'ఇందు' అర్థం చేసుకొని "అబ్బా! రిక్షావాడేలేవే టైమ్ వేస్టు చేయకండి అసలే ఫీజు ఎక్కువ."

"రిక్షావాడే లేవే" అన్న మాటలు రవి చెవుల్ని తాకాయి.

చివుక్కున ప్రక్కకు తిరిగాడు.

వాళ్ళు ముగ్గురూ! తనకు నచ్చిన రత్న!!

రత్న ఒక నిర్ణయానికి వచ్చింది. 'ఎలాగైనా ఈ రిక్షావాడి 'మిస్టరీ' కనిపెట్టాలి. 'చిరు' సినిమాకన్నా సస్పెన్స్‌గా వుందే? ఇక భరించడం నా వల్లకాదు' అనుకుంటూ లేచి కంప్యూటరు మాస్టారి దగ్గరకెళ్ళింది.

"ఏమిటమ్మా? హడావిడిగా వచ్చావు – ఎనీ ప్రాబ్లమ్?" అడిగాడు.

"ఏమీ లేదండీ! చిన్న డౌటు వుంటేను" ఏమి చెప్పాలో అర్థం కాక ఆగింది.

"చెప్పమ్మా! బ్రెయిన్‌లెస్ కంప్యూటర్ని బ్రెయిన్నున్న నువ్వు నేర్చుకోవడం కష్టం కాదు. నీ డౌటు చెప్పు."

"డి.కె. కంప్యూటర్ పాయింటు అని పేరెందుకు పెట్టారు సార్" ఎలా మొదలుపెట్టాలో అర్థంకాక తికమకపడుతూ అంది.

"ఆ పాయింటు కొచ్చావా? సింపుల్. డబ్బు కోసం కంప్యూటర్స్ అని తెలుగులో పెట్టలేక ఇంగ్లీషులో ఏడ్చానంతే" నవ్వుతూ చెప్పాడు.

"సార్ రిక్షా వాళ్ళకు కూడా కంప్యూటర్ నేర్పుతారా మీరు."

"వాడ్డూయూ మీన్" ఆశ్చర్యంగా అడిగాడు.

"మరి ఆ అబ్బాయి" అంటూ గ్లాస్ డోర్స్ లోంచి రవిని చూపించి "ఒక రిక్షా అబ్బాయి సార్. మమ్మల్ని ఒకసారి సినిమా హాలుకి తీసికెళ్ళాడు సార్. కావాలంటే మా ఫ్రెండ్స్ కూడా వున్నారు సాక్ష్యం."

"సీ! మనిషిని పోలిన మనిషి వుండొచ్చు. ఎనీ హౌ – నీ డౌటు ఇప్పుడే క్లారిఫై చేస్తాను" అంటూ రవిని పిలిపించాడు.

"మిస్టర్ రవి మీరు పోస్టుగ్రాడ్యుయేషన్ ఎక్కడ చేశారు?"

"వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో"

"గ్రాడ్యుయేషన్"

"చిలకలూరిపేట సి.ఆర్. కాలేజీలో! నాకు బి.యల్. అన్నామలై డిగ్రీ కూడా వుంది సార్."

"ఆర్.పి.డి. ఎక్కడ చేశావు?"

"అదేం డిగ్రీ సార్"

"రిక్షా పుల్లింగ్ డిప్లొమా?" స్ట్రెస్ చేసి చెప్పాడు.

"సార్! ఫీజు దగ్గర వంద రూపాయల కోసం బేరం ఆడావని చెప్పి ఇలా అమ్మాయిల ముందు నా మీద జోకులెయ్యడం బాగాలేదు సార్" అంటూ తన కంప్యూటర్ దగ్గరకెళ్ళిపోయాడు.

"సారీ సార్! మీకు ట్రబుల్ ఇచ్చినందుకు" చెప్పింది రత్న భయపడ్తూ.

మళ్ళీ 'కంప్యూటర్ పాయింటు'లో కంప్యూటర్ స్టూడెంట్‌గా రిక్షావాడు ప్రత్యక్షమయ్యాడు.

ఈసారి రత్న మాత్రం వదలదల్చుకోలేదు.

సీరియస్‌గా కంప్యూటర్ ప్రోగ్రాంలో మునిగి వున్న రవిని కల్పి మాటల్లో పెట్టింది.

"మీకు పామిస్ట్రీ తెల్సా?" అడిగింది.

"కొంచెం కొంచెం తెల్సు" పొడిపొడిగా అన్నాడు.

ఖంగుతింది రత్న. రిక్షావాడికి 'పామిస్ట్రీ' తెలియదంటే తెలియదు అనుకొని ఈ ప్రశ్న వేసింది తను.

మళ్ళీ తేరుకొని "సరే! నా చెయ్యి చూడండి" అని ఎడమచెయ్యి ఇచ్చింది.

"అబ్బ! ఏమి అదృష్టం! మీరొక రిక్షావాడిని పెళ్ళి చేసుకొంటారు."

ఆమె ముక్కుమీద కోపం కూచివూడి చెయ్యడం స్పష్టంగా కనపడింది రవికి.

కంట్రోలు చేసుకొని అడిగింది "ఏదీ మీ చెయ్యివ్వండి ఎలా వుందో చూస్తా?"

తన కుడి చెయ్యి ఇచ్చాడు రవి.

టెన్షన్, సిట్యుయేషన్ యండమూరి నవలలా వుంది.

ఆమె ఎడం చేతిలో అతని కుడిచెయ్యి.

తనూహించింది కరక్టే – అతని అరచెయ్యి 'రఫ్'గా కాయలు కాసి వుంది.

"మీరొక అమ్మాయిని పెళ్ళి చేసుకుంటారు" అని చెప్పి తుర్రున జారుకుంది.

రవికి ఏమీ అర్థం కానట్లు ఆమె వైపే చూస్తుండిపోయాడు.

అర్జంటుగా ఫ్రెండ్స్‌తో చెప్పేసి "షెర్‌లాక్ హోమ్స్" సిస్టర్‌లా ఫీలయిపోయింది రత్న.

ఆ రాత్రి రూములో రత్న ఆలోచనలన్నీ రవి చుట్టే.

ఆ క్షణంలో చిరంజీవి హీరోయిజం మీద విరక్తిపుట్టింది రత్నకి. "గ్యాంగ్ లీడరు"ట, "రౌడీ అల్లుడు'ట. ఛ! హీరో అంటే నిజ జీవితంలో అతికినట్లు సరిపోవాలి – ఇలా రవిలా. మనసులోనే రవికి ఒక "ఒన్ టూ ఒన్ డబుల్ ఫైవ్'కి మొదటిసారిగా డయల్ చేసింది రత్న.

రోజూ కంప్యూటర్‌లో రవి, రత్నల కళ్ళు కళ్ళు కలుసుకోవడం రికార్డయిపోతున్నాయి.

ఇద్దరూ "ఫ్లాష్ బ్యాక్"లు చెప్పకున్నారు.

అందమైన రవి ఫ్లాష్ బ్యాక్‌ని నెమరు వేసుకొంటోంది రత్న.

రవి, రత్న ప్రేమ కొద్దిరోజుల్లోనే 'మూడు టైపు రైటర్లూ, ఆరు కంప్యూటర్లు'గా ఎదిగిపోయింది.

కాలం రోజుల్నీ, వారాలనీ, నెలల్నీ త్వరత్వరగా కనేస్తున్నట్లుంది. రత్న, ఇందు, తేజ డిగ్రీలు పుచ్చుకొన్నారు.

ఒక శుభ ముహూర్తాన రవి, రత్న రిజిస్టర్ మారేజ్ చేసుకొన్నారు.

రత్నని సొంత సిస్టరులా చూసుకొని, ఇందు, తేజ "రిసెప్షన్"ని ఆనందంగా అరేంజ్ చేశారు.

రవి, రత్న హనీమూన్‌కి తిరుపతి వెళ్ళి వచ్చారు.

ఇప్పడు వాళ్ళ కళ్ళముందు 'ఫ్యూచర్ ప్లాన్' మాత్రమే వుంది.

రవికి గవర్నమెంటు జాబే చేయాలని వుండదు. వస్తే సరేసరి. లేకపోతై టైమ్ వేస్ట్ చేయకుండా, తన కాళ్ళ మీద తను నిలబడేలా ఏదో ఒకటి చెయ్యాలి. ఆ రోజు ఒక మంచి అయిడియా వచ్చింది వాళ్ళకు.

ఆ విషయమే తేజ, ఇందులకు చెప్పారు.

"ఏం పేరు పెడుతున్నారు?" అడిగింది తేజ.

"అరే! ఆ విషయమే మర్చిపోయా. ఏం పేరు పెడదాం?" అడిగాడు రవి.

"రిక్షా రసం టైపు కంప్యూటర్స్ అని పెట్టండి" ●

